15

శ్రీ విఖనస మహాగురవేనమః

వైఖానసము

ప్రచురణ :

శ్రీ మరీచి గ్రంథమాల

శ్రీ వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధినీ సభ,

తిరుమల - 517 504

శ్రియై నమః

శ్రీ విఖనస మహాగురవేనమః

వైఖానసము

(మొదటి సంపుటము)

సంకలనము : .

వైఖానసాగమ ప్రవక్త, తిరుపతి

ప్రచురణ :

శ్రీ మరీచి గ్రంథమాల

శ్రీ వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధినీ సభ, తిరుమల

1998

వైఖానస ఆగమప్రవక్త ప్రణీత

వైఖానసమ్

శ్రీ మరీచి గ్రంథమాల ప్రచురణ నెం. 1

ప్రథమ ముద్రణ : 1998

ప్రతులు : 5000

మూల్యం రు-. 2/-

ప్రతులకు :

కార్యదర్శి

శ్రీ వైఖానస దివ్యసిద్ధాంత వివర్ధినీ సభ

శ్రీ విఖనస ఆశ్రమం

రింగ్‌రోడ్

తిరుమల - 517 504 (ఆం. ప్ర.)

ముద్రణ :

వాణీ ప్రెస్

విజయవాడ - 520 002.

ముందు మాట

వైఖానసము అను ఈ చిన్న పుస్తకము వైఖానస శాస్త్రమును గురించి, బాలురకు, స్త్రీలకు, పామరులకు తెలియచేయుట కొరకు ప్రచురించబడుచున్నది. యిది ప్రథమ వాచకము. ఈ విధముగా ఒకదాని-తర్వాత మరి యొకటి చొప్పున అయిదు వాచకములుగా (five readers) ప్రచురించవలెనని సంకల్పము.

యువకులు, ఉద్యోగములలో యున్నవారు, అర్చకేతర వృత్తిలో యున్నవారు చూపుచున్న ఆసక్తిననుసరించి శ్రీ వైఖానస దివ్య సిద్ధాన్త వివర్ధినీ సభవారు ఈ గ్రంథ ముద్రణా కార్యక్రమము చేబట్టినారు. ప్రతివారు వైఖానసమును గురించి, శాస్త్రములను గురించి- తెలుసుకొనుట అవసరము.

ఈ ప్రయత్నములో సహకరించి గ్రంథరచన గావించి యిచ్చిన అజ్ఞాత పండితులకు కృతజ్ఞతలు. ఈ పుస్తకములను అన్ని ప్రాంతములలో యున్నవారికి అందించుట, మరియు పునశ్చరణ తరగతులు నిర్వహించుట చేయవలసియున్నది. ఆయా ప్రాంతములలోని వైఖానసులు, వైఖానస సంఘాలవారు మాకు తగిన చేయూతనిచ్చి ఈ కార్యక్రమము విజయవంతము చేయగలరని ఆశిస్తున్నాము.

శ్రీవైఖానస దివ్య సిద్ధాన్త వివర్ధినీ సభవారు ప్రారంభించనున్న ఈ ప్రచార కార్యక్రమమునకు అందరి సహకారము కోరుచున్నాము.

D. విఖనసాచార్యులు

కార్యదర్శి

శ్రీ వైఖానస దివ్యసిద్ధాన్త వివర్ధినీ సభ

తిరుమల

1-1-1998

శ్లో॥ శ్రీలక్ష్మీవల్లభారంభాం విఖనో మునిమధ్యమామ్।
అస్మదాచార్య పర్యంతాం వందే గురుపరం పరామ్ ॥

శ్రీ విఖనస ధ్యానం

పద్మనాభ మనోజాతం విష్ణుపూజా విశారదం
కుశాసనే సమాసీన మూర్ధ్వపుండ్ర పవిత్రకం
కిరీట హారాభరణ కుండలాంగద భూషితం
శిఖాయజ్ఞోపవీతాభ్యాం త్రిదండేన విరాజితం
వరదాభయహస్తం శంఖచక్రధరం ప్రభుం
పద్మంతు దక్షిణేహస్తే ధారిణం పీతవాసనం
కమండలు ఘటైర్యుక్తం బ్రహ్మర్షి గణసేవితం
తులసీపద్మమాలాభిస్తపనా చ సుశోభితం
పారమాత్మిక మంత్రజ్ఞం విఖనోమునిమాశ్రయే ॥

భక్త్యా భగవన్తం నారాయణమర్చయేత్

వైఖానసము

శ్రీ శ్రీనివాస పరబ్రహ్మణే నమః.

శ్రీ లక్ష్మీ వల్ల భారమ్భాం విఖనో మునిమధ్యమామ్
అస్మదాచార్య పర్యన్తాం వన్దే గురు పరంపరామ్ ॥
వేదాన్తనిలయ : శ్రీమాన్ కళ్యాణ గుణసాగరః
భక్త ప్రియోజగన్నాథః శ్రీనివాసో ఽస్తు మే హృది ॥

శ్రీ విఖనసాచార్యుల వారు :

వైఖానసులు విష్ణ్వారాధన చేయువారు. వీరికి మూల పురుషుడు శ్రీ విఖనసాచార్యులవారు. విఖనసుడు బోధించిన విధి విధానాలనే వైఖానసులు అనుసరిస్తారు.

ఆదికాలంలో యజుర్వేద శాఖగా వైఖానస సూత్రాన్ని రచించిన విఖనసుడు స్వయముగా బ్రహ్మయే. భృగువుయొక్క క్రియాధికారం విష్ణువునకు విఖనసునకు అభేదం చెప్పినది.

"విఖనా వై విష్ణుః తజ్జా వైఖానసా స్మృతాః
విష్ణ వంశజశ్చ విఖనామునీనాం ప్రథమో మునిః
తేనోపదిష్టం యత్సూత్రం తత్సూత్రే సూత్తమం స్మృతమ్.

- 36 అధ్యాయం 28, 29 శ్లో.

విఖనసుడే విష్ణువు. ఆయన వంశస్థులే వైఖానసులు. విష్ణ వంశజుడైన విఖనుడు మునులలో ప్రథముడు. ఆయన ఉపదేశించిన సూత్రం కల్ప సూత్రములన్నిటిలోను ఉత్తమమైనది.

విఖనసుడు అనే పదానికి అర్థం ప్రకీర్ణాధికారం 30 అధ్యాయములో ఇట్లా చెప్పబడినది.

"అంతర్హితానాం ఖననా ద్వేదానాంతు విశేషతః
స విభుః ప్రోచ్యతే బ్రహ్మా విఖనా బ్రహ్మ వాదిభిః ॥ 56 ॥
వైఖానసశ్చ భగవాన్ ప్రోచ్యతే సపితామహః ॥ 57॥

అంతర్హితంగా ఉన్న వేదాల అర్థాలను విశేషంగా ఖననం చేయటం (= త్రవ్వి పైకి తీయటం) వల్ల, ఆ ప్రభువును బ్రహ్మవాదులందరూ "విఖనుడు" అని పిలిచారు. ఆయనయే భగవంతుడైన వైఖానసుడు. ఆయనయే పితామహుడు అని అర్థము.

శ్రీ విఖనసులవారు భూలోకమునకు అవతరణ మొనర్చిన దినమందు మనము వారి అవతరణోత్సము జరుపుకొనుచున్నాము.

శ్రవణే శ్రావణే శుక్ల పూర్ణిమా సోమవాసరే
సింహలగ్నే చ సంయుక్తే భజే నైమిశ మాగతమ్ ॥

శ్రావణ మాసములో శుక్ల పూర్ణిమా సోమవారము, శ్రవణ నక్షత్రముతో కూడిన దినమున సింహలగ్నములో శ్రీ ఆచార్యులవారు నైమి శారణ్యమునకు వచ్చిరి. ఈ నైమిశము ఉత్తర ప్రదేశ్‌లోని సీతాపూర్ వద్ద (మిశ్రీక్ మండలము) కలదు. అచ్చట గోమతీనది కలదు. ఈ నైమిశములో శ్రీ విఖనసాచార్యులవారి ఆలయము నిర్మించవలయునని కీ॥శే॥ శ్రీ పరాశరం వేంకట రామాచార్యులు గారు, విజయవాడవారు ఎంతో కృషి చేసిరి. వారి కుమారులు మరియు వైఖానస సమాజం, విజయవాడవారు ఆలయ నిర్మాణము గావించి శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని ప్రతిష్ఠ గావించిరి. ఆ ఆలయ ప్రాంగణములోనే శ్రీ ఆచార్యులవారిని కూడ ప్రతిష్ఠించిరి.

పురాణములన్నియు నైమిశారణ్యమునందే బోధింపబడినవి. ఋషులు అచ్చట ఎన్నోయజ్ఞయాగాదులు జరుపుచుండెడివారు. మహర్షులు ఎంతో మంది అచ్చట నివసించిరి.

శ్రీ వైఖానస కల్ప సూత్రము : శ్రీ విఖనసాచార్యుల వారు మనకు అనుగ్రహించినది వారి స్వరచనగా కల్ప సూత్ర గంథ మొక్కటియే. అది 32 ప్రశ్నలతో కూడి యుండి నాలుగు భాగములుగా యున్నది.

1) స్మార్త సూత్రము - 7 ప్రశ్నలు
2) ధర్మ సూత్రము - 3 ప్రశ్నలు
3) ప్రవర సూత్రము - 1 ప్రశ్న
4) శ్రౌత సూత్రము - 21 ప్రశ్నలు

అందలి స్మార్త సూత్రములో అష్టాదశ కర్మలు, విష్ణ్వర్చన వివరించబడినవి. ధర్మసూత్రములో వర్ణాశ్రమ ధర్మములు వివరించబడినవి. ప్రవర సూత్రములో గోత్ర ప్రవరలు, శ్రౌత సూత్రములో యజ్ఞాదులు వివరించబడినవి. అందుకే

శ్రౌత స్మార్తాదికం కర్మ నిఖిలం యేన సూత్రితమ్
తస్మై సమస్త వేదార్థవిదే విఖనసే నమః ॥

అని వారిని స్తోత్ర పాఠములో స్మరించుచున్నాము. ప్రసిద్ధముగా యున్న అష్టాదశ కల్ప సూత్రములలో వైఖానస సూత్ర మొకటియై యున్నది. ఈ కల్ప సూత్రములు నాల్గు వేదముల వారికి వేర్వేరుగా కలవు. వైఖానస కల్ప సూత్రము యజుర్వేద శాఖకు సంబంధించి యున్నది. యీ పదునెనిమిది సూత్రములలో అన్నియు సంపూర్ణముగా లేవు. శ్రీ వైఖానస కల్ప సూత్రము సంపూర్ణముగా యున్నది. అన్యసూత్రాపేక్ష లేక యున్నది. అంతేగాక వాన ప్రస్థాశ్రమము, శ్రామణకాగ్ని విధానములకు ఇతర సూత్రకారులు కూడ వైఖానస కల్ప సూత్రమునే అవలంబించుచున్నారు.

ఈ కల్ప సూత్రములలో పెక్కింటిలో భగవదారాధన విషయము చెప్పబడలేదు. ఒకటి రెండింటిలో చెప్పబడినను నానాదేవతోపాసనము చెప్పబడినది గాని వైఖానస సూత్రములో వలె నిర్దిష్టముగా విష్ణ్వారాధన

వివరింపబడలేదు. శ్రీ వైఖానస కల్ప సూత్రమందు మాత్రము నిత్యకర్మల తర్వాత విధిగా భగవదారాధనము చెప్పబడినది.

"అథాగ్నౌ నిత్య హోమాన్తే విష్ణోర్నిత్యార్చా సర్వదేవార్చా భవతి" ॥ 95॥

తస్మాద్గృహే పరమం విష్ణుం ప్రతిష్ఠాప్య సాయం ప్రాతర్హోమాన్తే ఽర్చయతి ॥97॥ -స్మార్తే చతుర్థ ప్రశ్న - దశమః ఖండః

అనగా అగ్నియందు నిత్యాగ్ని హోత్రమైన పిమ్మట విష్ణువును నిత్య మర్చించుట సర్వదేవార్చనయే యగును. అందువలన గృహమందు పరదేవతయగు విష్ణుమూర్తిని ప్రతిష్ఠించి సాయం ప్రాతఃకాలముల యందు నిత్యహోమమైన పిమ్మట నర్చించవలెనని చెప్పెను.

ఆ తర్వాత అదే చతుర్థ ప్రశ్న ద్వాదశ ఖండలో నిత్యార్చన విధానము చెప్పబడెను. అర్చనా విధానము చెప్పి ఆ ఖండ చివరిలో అమృతతుల్యమైన ఈ దిగువ వాక్యములు చెప్పబడెను.

"ద్విజాతి రతన్ద్రితో నిత్యం గృహే దేవాయతనేవా భక్త్యా భగవన్తం నారాయణ మర్చయేత్ ॥ 20 ॥

తద్విష్ణోః పరమం పదం గచ్ఛతీతి విజ్ఞాయతే ॥ 12 ॥

నిత్యమును గృహమందుగాని దేవాలయమందుగాని భక్తితో భగవంతుడగు శ్రీ మన్నారాయణుని యర్చించవలెను.

అతను విష్ణువు యొక్క పరమపదమైన వైకుంఠ ప్రాప్తిని తప్పక పొందగలడని చెప్పెను.

యీ "భక్త్యా భగవన్తం నారాయణ మర్చయేత్" అను సూత్రమునే శ్రీ వైఖానస దివ్య సిద్ధాన్త వివర్ధినీ సభవారు విశేష ప్రచారము చేయుచున్నారు. యిదియే వైఖానస దివ్య సిద్ధాంతమని చెప్పవచ్చును. భగవంతుడైన నారాయణుని భక్తితో అర్చించాలి.

శ్రీ వైఖానస కల్ప సూత్రములోని భాగమైన ధర్మ సూత్రములో అష్టమ ప్రశ్న ఏకాదశ ఖండలో యిట్లు చెప్పబడినది.

"సగుణే బ్రహ్మణి బుద్ధిం నివేశ్య పశ్చాన్నిర్గుణం బ్రహ్మ ఽఽ శ్రిత్య మోక్షే నిత్యం యత్నం కుర్యాదితి విజ్ఞాయతే" ॥ 3 ॥

అనగా సగుణ రూపుడైన బ్రహ్మము నందు బుద్ధి నిల్పి, తరువాత నిర్గుణుడైన బ్రహ్మమును ఆశ్రయించి, మోక్షము కొరకు నిత్యము ప్రయత్నము చేయవలయునని భావము.

యిదియే వేదముల సారము. సర్వోపనిషత్సారము.

"ఏ తద్వైఖానసం సూత్రం సర్వవేదార్థ సంగ్రహః" అని ప్రకీర్ణాధికారము 30 అధ్యాయము 75 శ్లోకములో చెప్పబడినది.

శ్రీ విఖనోముని శిష్యులు

శ్రీ విఖనసాచార్యులవారి ప్రథమ శిష్యులు నలుగురు. వారు భృగువు, అత్రి, మరీచి, కశ్యప మహర్షులు. వీరు శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్ర గ్రంథములను రచించిరి. వాడుకలో వాటినే వైఖానసాగమములని పిలుచుచున్నారు.

ప్రకీర్ణాధికారం 30వ అధ్యాయములో 9 మంది శిష్యులుగా చెప్పబడినది.

భృగ్వం గిరో మరీచ్యత్రి పులస్త్య పులహాः క్రతుः
తధా వసిష్ఠో దక్షశ్చ నవ బ్రహ్మాణ ఈ రితా ः ॥ 63 ॥
ఏతే విఖనస శ్శిష్యా శ్రుతి స్మృతి విధానతः
తచ్ఛిష్యాస్తు మహాత్మానో మునయస్తత్వదర్శిన ः ॥ 64 ॥

వారు భృగువు, అంగిరసుడు, మరీచి, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు, దక్షుడు, అనువారలు. వీరే నవబ్రహ్మలు. వీరే విఖనసముని శిష్యులు; మహాత్ములు, తత్వదర్శులు అయిన ఈ శిష్యులు, శ్రుతి స్మృతి విధానములను అనుసరించి, వేదానుగాములైన శాస్త్రాలను, లోకహితం కోసం నిర్మించినారు.

వైఖానస గ్రంథములు

పూర్వము విఖనుడు సమిష్ట్యాత్మకంగా వైఖానస సూత్రమును చెప్పినారు. సమిష్టి రూపంగా ఉన్న వేదము ఋగ్ - యజుస్ - సామ - అధర్వణ బేధముల చేత నాలుగు విధములైనట్లే, సమిష్టి రూపంగా ఉన్న వైఖానస సూత్రం వ్యష్టి రూపంగా నాలుగు విధాలైనది.

చతుర్ధా వ్యష్టి రూపేణ తత్సూత్రం చా-భవ త్పున ఃఆత్రేయం భార్గవం చైవ మారీచం కాశ్యపం త్వితి ॥ 13 ॥

- యజ్ఞాధికారే - 51 అధ్యాయము

అవే ఆత్రేయం, భార్గవం, మారీచం, కాశ్యపం అని ఆయా ఋషులు చెప్పినవి.

భృగుమహర్షి ప్రకీర్ణాధికారములో తొమ్మిది మంది శిష్యుల పేర్లు చెప్పిననూ, యజ్ఞాధికారములో నలుగురు శిష్యులే గ్రంథ రచన చేసినట్లు చెప్పెను. అందుచే మిగిలిన 5గురు ఋషులు వైఖానస శాస్త్ర గ్రంథములు రచించినట్లు కానరాదు. యజ్ఞాధికారము 51 అధ్యాయములో ఏయే ఋషులు ఏయే గ్రంథములు రచించినదీ తెలుపబడెను.

1. భృగు మహర్షి ప్రోక్తములు

ఖిలాధికారము ; క్రియాధికారము ; వాసాధికారము ;
మానాధికారము ; నిరుక్తాధికారము ; ప్రకీర్ణాధికారము ;
అర్చనాధికారము ; యజ్ఞాధికారము ; వర్ణాధికారము ;
పురాధికారము ; - 10 గ్రంథములు

వీటితోబాటు చిత్రాధికారము, ప్రతిగృహ్యాధికారము, ఉత్తర తంత్రము అను మూడు కూడ భృగు ప్రోక్త గ్రంథములని చూపబడుచున్నది. కనుక భృగు ప్రోక్తగ్రంథములు పదమూడుగావాడుకలో చెప్పబడుచున్నది. భృగువు మాత్రం తన రచనలు పదకొండు అని యజ్ఞాధికారంలో పేర్కొన్నాడు. (యజ్ఞాధికారం. 51 అధ్యాయం)

"భార్గవం యత్ మయాకృతమ్ తత్ ఏకాదశధా మతమ్"॥ 13 ॥

యీ గ్రంథములలో ఖిలాధికారము, క్రియాధికారము, ప్రకీర్ణాధికారము, యజ్ఞాధికారము అనునాలుగు తిరుమల తిరుపతి దేవస్థానము వారిచే పునర్ముద్రించబడినవి. వాసాధికారము కూడవారే ముద్రించుచున్నారు. మిగిలిన వాటిలో అర్చనాధికారము, నిరుక్తాధికారము, చిత్రాధికారములు లభించగల అవకాశములున్నవి. ఈ ఎనిమిదిగాక మిగిలిన గ్రంథములు లభ్యము అగుటలేదు.

2. మరీచి మహర్షి ప్రోక్తములు

జయసంహిత; ఆనందసంహిత ; సంజ్ఞాన సంహిత;
వీర సంహిత; విజయసంహిత; విజిత సంహిత;
విమల సంహిత; జ్ఞానసంహిత; విమానార్చనకల్పము.

ఈ తొమ్మిది గ్రంథములలో విమానార్చన కల్పము మాత్రము లభ్యమై ప్రచురించబడినది. తెలుగు లిపిలో యున్న గ్రంథము, ద్వారకా తిరుమల దేవస్థానం వారి చేతనూ, దేవనాగరలిపిలో యున్న గ్రంథము తిరుమల తిరుపతి దేవస్థానము వారి చేతనూ, ప్రచురణ (పునర్ముద్రణ) చేయబడినవి. ఆనందసంహిత కూడ T.T. Devasthanam వారు పునర్ముద్రణ గావించుచున్నారు. లోగడ ఈ గ్రంథమును ఈగావారి పాలెం వారు ముద్రించిరి.

జయసంహితలో కొంత భాగము దొరకవచ్చునేమో, మిగిలిన ఆరు గ్రంథముల ఆచూకీ తెలియుట లేదు.

3. అత్రి ప్రోక్తములు

అత్రి మహర్షి నాలుగు గ్రంథములు రచించెను. అవి సమూర్తార్చనాధికారము, అనబడే ఆత్రేయతంత్రము, పూర్వ తంత్రము, విష్ణుతంత్రము, ఉత్తర తంత్రము అనబడుచున్నవి. వీనిలో సమూర్తార్చనాధికారమును దేవనాగరలిపిలో తిరుమల తిరుపతి దేవస్థానము వారు ప్రచురించిరి. మిగిలిన మూడు గ్రంథములు లభ్యమగుట లేదు.

ఉత్తర తంత్రము పేరు భృగు ప్రోక్తముల జాబితాలో కూడ కలదు. అది లభ్యముకానందున ఎవరిచే చెప్పబడినదీ తెలుసుకొనలేము.

4. కాశ్యప మహర్షి ప్రోక్తములు

సత్యకాండ; తర్కకాండ; జ్ఞానకాండ;

సంతానకాండ; కాశ్యపకాండ అను అయిదు గ్రంథములు.

వీనిలో జ్ఞానకాండ మాత్రము తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే ముద్రించబడినది. మిగతా గ్రంథములు లభ్యమగుట లేదు.

మొత్తము (13 + 9 + 4 + 5) = 31 గ్రంథములలో 9 గ్రంథములు ముద్రణలో యున్నవి. యింకొక 3 లేక 4 గ్రంథములు లభించవచ్చునని ఆశయున్నది. మిగిలిన 18 గ్రంథములు లభించు అవకాశములు లేవు. వాటి పేర్లు ఎక్కడా వినిపించుట లేదు. అవి కాలగర్భములో కలసిపోయినవి. ఎంత దురదృష్టమో చూడుడు. కనీసము వున్నవాటినైనా సంరక్షించుకొనుట మన భాద్యత.

తిరునక్షత్రములు

శ్రీ వికనసుల వారిచే సంక్షిప్తముగా గృహార్చన కల్పసూత్రములో చెప్పబడియున్నది. దానిని విస్తరించి దేవాలయములలో అర్చనా విధానమును ఈ నల్గురు ఋషులు చెప్పినారు. ఈ నల్గురు ఋషుల యొక్క తిరునక్షత్రముల గురించి క్రియాధికారము అయిదవ అధ్యాయములో ఇట్లు చెప్పబడినది.

1. భృగుమహర్షి - చాంద్రమాన వైశాఖ మాసము రోహిణీ నక్షత్రము (ఈ సం॥ 29-4-98 అగుచున్నది)
2. మరీచి మహర్షి - ఆషాఢమాసే పూర్వ ఫల్గుని నక్షత్రం (ఈ సం॥ 29-6-98 అగుచున్నది)
3. అత్రి మహర్షి - కార్తీకమాసే శ్రవణ నక్షత్రము (ఈ సం॥ 29 - 10 - 98 అగుచున్నది)
4. కాశ్యప మహర్షి - శ్రావణ మాసే హస్తా నక్షత్రము (ఈ సం॥ 29-7-98 అగుచున్నది)

ఆయా దినములందు ఆయా మహర్షుల తిరునక్షత్రములు జరుప వలయును. తిరుమల తిరుపతి దేవస్థానము వారు కూడ ఈ తిరునక్షత్రములు జరిపించుచున్నారు.

వైఖానసాగమము

వైఖానసాగమములలో ఈ క్రింది విషయములు చెప్పబడినవి.

1. దేవాలయ నిర్మాణము.
2. విగ్రహ లక్షణములు, వాటి కొలతలు.
3. బింబప్రతిష్ఠ.
4. నిత్యార్చన, విశేషార్చనలు.
5. ఉత్సవములు.
6. ప్రాయశ్చిత్తములు.
7. తత్త్వచింతన.

వీటిలో ఒక్కొక్క విషయములోను వివరముగా ఎన్నో అంశములు కలవు. వాటిని గురించి తర్వాత వివరించబడును. భూపరీక్ష మొదలు విగ్రహ ప్రతిష్ఠ చేయువరకు గల వివరములు సంపూర్ణముగా వైఖానసాగమ గ్రంథములలో చెప్పబడినవి. ఏ ఆగమ గ్రంథములలోనూ ఇంత సమగ్రముగా, స్పష్టముగా అన్ని విషయములు చెప్పబడలేదు.

ఆగమముల గురించి కొంత తెలుసుకుందాము. ఆగమములు ప్రధానముగ వైష్ణవాగమములు, శైవాగమములు, శాక్త గమములు, దేవ్యాగమములు, వైదికాగములు అని అయిదు విధములుగా యున్నవి. అవి తిరిగి క్రింది విధముగా విభజించబడినవి.

1. వైష్ణవాగమములు

ఎ) వైఖానసాగమము (31)

బి) పాంచరాత్రాగమము (141)

సి) భాగవతము - అని మూడు విధములు.

2. శైవాగమములు

ఎ) శివ భేద (10)

బి) రుద్ర భేద (18) అని రెండు విధములు. వీటికి ఉపాగమములు 207 వరకు గలవు.

3. శాక్త గమములు

ఎ) గరుడ తంత్ర (28)

బి) వామ తంత్ర (24)

సి) దక్షిణ తంత్ర (32)

డి) భూత తంత్ర (20)

అని నాలుగు విధములు

యివిగాక యీ క్రింది విభాగములతో కొన్ని తంత్రములు గలవు. భైరవ (8); యామళ (8) మాత (8); మంగళ (8); చక్ర (8); శిఖ (8); బహురూప (8) మరియు వాగీశ (8)అని ఎనిమిది విభాగములు. యివి 8 × 8 = 64 తంత్రములు

4. దేవ్యాగమములు

యివి మూడు విభాగములతో యున్నవి.

ఎ) విష్ణు క్రాంత (64)

బి) రథ క్రాంత (64)

సి) అశ్వక్రాంత (64) అనునవి.

5.వైదికాగమములు

అష్టాదశ వైదిక విద్యలయందుగల విధానములే వీరి ఆగమ శాస్త్రములు. ప్రత్యేకించి ఆగమ గ్రంథములు లేవు. పురాణాదులలో చెప్పబడిన ఆగమ లక్షణములు వీరు పాటింతురు.

సాధారణముగా ప్రతి ఆగమములోను నాలుగు పాదములుండును. వాటిని జ్ఞాన పాదము, క్రియా పాదము, చర్యా పాదము, యోగపాదము

అందురు. యివి జ్ఞానము, భగవదారాధన క్రియలు, శౌచాచారములు మరియు ఆలయ నిర్మాణాదులు, అష్టాంగములతో కూడిన యోగములు వివరించును.

పైన బ్రాకెట్లలో ( ) యిచ్చిన సంఖ్య ఆ యా ఆగమ గ్రంథముల సంఖ్యను సూచించును.

భగవదారాధనము అమూర్తము, సమూర్తము నని రెండు విధములు. అవి జపము, హోమము,అర్చనము,ధ్యానమునని నాల్గు విధములుగా యుండును. దేవాలయములలో విగ్రహారాధన సమూర్త పూజనము అగుచున్నది. జపము, హోమము, ధ్యానము అనునవి అమూర్త యజనములు. విగ్రహములను పూజించుటకు వారి వారి యిండ్లలో విగ్రహములను పెట్టుకుని పూజించవచ్చును గదా ! దేవాలయములెందుకు అని ప్రశ్న రావచ్చును. వారి వారి గృహములలో చేయు పూజ స్వార్థ పూజ యనియు, ఆలయములలో చేయు పూజ పరార్థ పూజ యనియు చెప్పబడినది. స్త్రీలు, బాలురు, వృద్ధులు, అశక్తులు, పామరులు మొదలగువారందరికి భగవత్సేవలో అవకాశమును దేవాలయములు కలుగచేయుచున్నవి. ప్రజల క్షేమము, గ్రామము, రాష్ట్రము, దేశములయొక్క క్షేమమును కోరుచూ అర్చకుడు ప్రతి నిత్యము ఆలయములో పూజలు జరుపును.

దేవాలయములు

భక్తజనుల సౌకర్యార్థము భగవంతుడు అర్చారూపియై భూలోకమునకు వచ్చెను. ధ్రువ బేరము అనగా మూల విగ్రహముతోపాటు కౌతుక బేరము, స్నపన బేరము, ఉత్సవ బేరము, బలి బేరములు ఆలయములలో యుండును. వీటిని పంచ బేరములందురు. ధ్రువ బేరము నుంచొని యున్నట్లుగాని, కూర్చొనియున్నట్లుగాని, శయనము (పడుకొని) యున్నట్లుగాని యుండును. ధ్రువ బేరము శ్రీదేవీ, భూదేవులతోగాని లేక శ్రీదేవితోగాని లేక ఒక్కరుగా గాని యుండును.

ప్రతి దేవాలయములోను ద్వార పాలకులు, పరివార దేవతలు, ప్రాకార దేవతలు ఆ యా స్థానములలో ఆవాహన చేయబడియుందురు. వాటి వివరములు తర్వాత తెలుసుకుందాము. ఆలయములు అయిదు విధములుగా చెప్పబడినవి.

1. **స్వయంవ్యక్త స్థలము :** శ్రీ మహా విష్ణువే స్వయముగా అవతరించిన స్థలములు.
2. **దివ్యస్థలము :** దేవతలచే ప్రతిష్ఠ చేయబడిన స్థలము.
3. **సిద్ధస్థలము :** మహర్షులు తపస్సు చేసి సిద్ధి పొంది శ్రీ స్వామి వారిని ప్రతిష్ఠించిన స్థలము.
4. **పౌరాణ స్థలము :** పురాణములలో చెప్పబడి ప్రసిద్ధిగాంచిన స్థలము.
5. **మానుష స్థలము :** రాజుల చేత, భక్తుల చేతగాని ప్రతిష్ఠ చేయబడిన స్థలము.

వీటి వివరములు ప్రకీర్ణాధికారములో 34 అధ్యాయము (పేజి 390 నుంచి) లో చూపబడినవి.

కొందరు శ్రీ స్వామివారి విగ్రహము మాత్రము ఆలయములోనున్నచో దివ్య స్థలము కాదనియూ, భక్తాదులను కూడ ప్రతిష్ఠించిననే దివ్య స్థలమగుననియూ చెప్పుదురు. అది యదార్థము కాదు. అంతేగాక ప్రాంతీయ భాషలలో స్తోత్రములు చదువవలెననియూ లేనిచో అది దివ్య స్థలము కాజాలదనియూ కూడ ప్రచారము చేయుదురు. అదియునూ యదార్థము కాదు. శ్రీ వైఖానస శాస్త్రము వైదిక కర్మలతో కూడియున్నది. ఈ శాస్త్రములో ఈ విషయములు చెప్పలేదు. భక్తితో భగవంతుడైన శ్రీమన్నారాయణమూర్తిని అర్చించవలయును.అంతేగాని పై విధమైన ప్రచారములను శాస్త్ర సమ్మతములుగా భావించరాదు.

దివ్యస్థలమనగా యిట్లు చెప్పబడినది.

దేవైః ప్రతిష్ఠితో యత్ర హరిరావిర్భూవహి
తద్దివ్యస్థల ముద్దిష్టం దేవో దివ్య ఉదీర్యతే ॥ 19 ॥

-ప్రకీర్ణాధికారము 34 అధ్యాయము

భక్తాదుల ప్రతిష్ఠ, ప్రాంతీయ భాషలలో స్తోత్రము వల్ల దోషము లేదు కాని అవి లేని స్థలము దివ్య స్థలము కాదనుట సరికాదు.

ఆలయములలో నడవడి

దేవాలయ అర్చకులు ఏ విధముగా వుండవలెనో, భక్తులు ఏ విధముగా యుండవలయునో, అధికారులు ఏ విధముగా యుండవలయునో ఆగమ శాస్త్రములో వివరించబడినది. ప్రకీర్ణాధికారము 20 వ అధ్యాయములోను, 36 వ అధ్యాయములోను వివరముగా చెప్పబడినది. వాటిలో కొన్ని ఈ దిగువ వ్రాయబడుచున్నవి. వాటిని వ్యతిరేకించి చేసినచో అపచారములుగా చెప్పబడినవి.

1. ఆలయము లోపల వాహనము మీదగాని, పాదరక్షలతో గాని తిరుగరాదు.
2. ఆలయమునకు మెల్లగా ప్రదక్షిణము చేసి, పిమ్మట లోనికి ప్రవేశించాలి.
3. ఆలయములోనికి తలపాగా ధరించికాని, చేతిలో ఆయుధము పట్టుకొనిగాని, ప్రవేశించరాదు.
4. రిక్తహస్తుడుగా కాని, తిలకం ధరించకుండా కాని, తాంబూల చర్వణం చేస్తూ కాని, ఉపహారాదులను తినుచూ గాని దేవాలయం ప్రవేశించరాదు.
5. ఆలయ ప్రాంగణములో మల మూత్ర విసర్జన చేయరాదు.
6. ఆలయమందు కాళ్ళు చాపుకొని కూర్చుండుట, నిద్రపోవుట చేయరాదు.
7. ఆలయములో ఏ ప్రాణికైనా దుఃఖం కలిగించే ఏ హింసనూ చేయరాదు.
8. ఆలయములో ఎన్నడూ వివాదములు పెట్టుకోరాదు.
9. ఆలయములో అహంకారముతో, గర్వముతో, అధికార దర్పముతో యుండరాదు.
10. ఆలయములో దేవుని ఎదుట పర స్తుతిని, పర నిందను కూడా చేయరాదు.
11. ఆలయములో దేవునకు పృష్ఠభాగం చూపిస్తూ కూర్చుండరాదు.

12. అధికార గర్వంతో అకాలంలో ఆలయం ప్రవేశించి అకాల సేవలను చేయరాదు.
13. మత్తు పదార్థములను, మాదక ద్రవ్యములను సేవించిగాని, సురాపానము చేసిగాని ఆలయమును ప్రవేశించరాదు.
14. ఒక చేతితో ప్రణామము చేయరాదు.
15. స్త్రీలతో సాభిప్రాయంగా మాట్లాడటం, అశ్లీల కథనము చేయరాదు.
16. ఆలయములో ఇతరులకు నమస్కరించటం చేయరాదు, భగవంతుని ఎదుట అందరూ సమానులే అని భావించవలెను.

ఈ విధంగా ఆలయ మర్యాదలు, సాంప్రదాయములు పాటించ వలయును.

ఆలయ నిర్వహణ

ఆలయములో నిత్యం (రోజులో ఆరు లేదా మూడు లేదా రెండుసార్లు) జరిగే అర్చనల వల్ల రాష్ట్రముయొక్క భద్రత, సంపద, క్షేమం ఆధారపడి వుంటాయి కాబట్టి అర్చకుని పేదరికంవల్ల ఆలయార్చనకు విఘాతం కలుగకుండా చూడవలసిన బాధ్యత పాలకులది. కావున, అర్చకుడు సుఖంగా జీవించటం కోసం వానికి పన్నులు విధింపని భూమిని ఈనాముగా యివ్వాలని శాస్త్రాలు నిర్దేశిస్తున్నవి.

అవిచ్ఛిన్నా యథాపూజా విధినా సంప్రవర్తతే
తథా ప్రకల్పయేద్విద్వాన్ భూమి భోగేన వైస్థితిమ్ ॥
అర్చకస్యార్చనార్థం చ కుటుంబార్థంచ యత్నతః
అత్యంత పుష్కలాం భూమిం బహుసస్యోచితాం తథా ॥
కరగ్రాహాది రహితా మర్చకాయ సమర్పయేత్ ।

-ప్రకీర్ణాధికారం - 12 అధ్యాయం 111 - 113 శ్లోకం

విధి పూర్వకంగా, అవిచ్ఛిన్నంగా ఆలయంలో పూజలు జరగటం కోసం భూమిని భోగ్యంగా ఇవ్వటం ద్వారా ఏర్పాటు చేయాలి. అర్చనార్థం,

అర్చకుని కుటుంబ పోషణ నిమిత్తం అత్యంత పుష్కలము, బహు సస్యోచితం అయిన భూమిని పన్నులు మున్నగునవి లేనివిగా (కరగ్రాహాది రహితంః) అర్చకునకు సమర్పించాలి.

ఆలయ నిర్వహణలో అర్చకుని క్షేమంకూడా చాల ముఖ్యము. అర్చకుడు కష్టాలలో ఉంటే అర్చన యథావిధిగా జరుగదు

ఆలయం యొక్క ఆధ్యాత్మిక శక్తి, ప్రతిమలోని దైవత్వం - ఇవి పూర్తిగా అర్చకుని మీద, అతడు పూజ చేయటంలోని అభినివేశం మీద ఆధారపడి ఉంట్టాయి. సమాజంలో ఆలయం అనే వృక్షం పెరగటానికి మూలం అర్చకులు, అగ్రం పాలకులు లేదా కార్య నిర్వాహకులు. అగ్రం పెరగటానికి మూలం ఆధారం కావున మూలాన్ని హింసించరాదు. యిదే విషయం ప్రకీర్ణాధికారము 12 వ అధ్యాయములో ఇట్లు చెప్పబడినది.

అగ్రం వృక్షస్య రాజానో మూలం వృక్షస్య పూజకాః ।
తస్మాన్మూలం నహింసీయా న్మూలాదగ్రం ప్రరోహతి ॥
ఫలం వృక్షస్య రాజానో పుష్పం వృక్షస్య పూజకాః ।
తస్మా త్పుష్పం న హింసీయా త్పుష్పా త్ఫలమ్ ॥

అంతేకాదు అర్చకుడు పుష్పం; పాలకులు లేదా కార్యనిర్వాహకులు ఫలం. ఫలం పుష్పంనుంచి పుడుతుంది. కావున ఆ పుష్పాన్ని హింసించరాదని చెప్పబడినది.

ఒక ఆలయం ప్రసిద్ధికి వచ్చిందంటే అందుకు దాని వాస్తు నిర్దోషత కాని, ప్రదేశం కాని, శిల్ప వైచిత్రి కాని కారణం కాదు. అందుకు ఒకే ఒక కారణం, అర్చామూర్తిలో దైవత్వం నెలకొనటం. అట్లా దైవత్వం మూర్తీభవించటానికి ప్రధాన కారణం - సుశిక్షితులు సద్వర్తనులు అయిన అర్చకులు క్రమ పద్ధతిలో నిరంతరాయంగా, లోపరహితంగా శతాబ్దాలపాటు అర్చనలు చేయటమే అని ఆగమాలు పేర్కొంటున్నాయి. కావున భారతదేశంలోని ఆలయ సంస్కృతిలో అర్చకుని పాత్ర విస్మరింపరానిది.

ఏవో చట్టాలు చేసినా, ఆ చట్టాలు రాజ్యాంగబద్ధమే అయినా అవి పై సత్యాల్ని విస్మరించలేవు. ఈ చట్టాలు ఉద్యోగ నియామకాలను నియంత్రించగలవు కాని ఆధ్యాత్మిక శక్తిని, భగవదారాధనా ప్రాశస్త్యాన్ని, ఆలయములలోని దైవత్వాన్ని ఆపలేవు లేదా ఆపుటకు ప్రయత్నము చేయు సంకల్పము వాటిలో ఉండరాదు. గనుక అర్చకులు తమ వైదికాచారములు పాటించుచూ భగవదారాధన కార్యక్రమములు నిశ్చింతగా నిర్వహించునట్లు చూడవలసిన బాధ్యత ఆలయ నిర్వాహకులపై గలదు.

వైఖానస తత్త్వచింతన

వైఖానసులకు దేవాలయ అర్చకత్వము జీవనోపాధిగాను, కర్తవ్యముగాను యుంటున్నది. ప్రజలలో వీరు గుళ్ళో పూజలు చేయుట, కొబ్బరికాయలు కొట్టుట, ప్రసాదములు పంచుటలో మాత్రమే గుర్తించ బడుచున్నారు గాని వేదాంత విషయములు, తత్త్వ విచారణకు మార్గదర్శకులుగా తెలియబడుటలేదు. కొందరికి వైఖానస శాస్త్రములో తత్త్వ విచారణ విషయములు చెప్పినట్లు కూడ తెలియకపోవచ్చును. పరిశీలించి చూచినవారికి గాని శాస్త్రములోను, శ్రీ వైఖానస సూత్రములోను ఈ విషయములు వివరించినట్లు తెలియదు.

మరీచి విమానార్చన కల్పములో **"తత్త్వ జ్ఞానోపదేశ విధి"** అను పేరుతో 80 పటలమునుంచి ప్రారంభమై 96 వ పటలము వరకు తత్త్వ చింతన, యోగాభ్యాసము, భగవదారాధన వలన మోక్ష ప్రాప్తి చక్కగా వివరించబడినది.

"తదారాధనేన సంసారార్ణవ నిమగ్నో జీవాత్మా పరమాత్మానం నారాయణం పశ్యతి. సో ఽప్య పునరావృత్తికం దివ్యలోకం ప్రాపయతి. పశ్చాత్కృతకృతో-భవతి. సంసార బంధన వాసనాన్ముక్తిర్మోక్షః"

-విమానార్చన కల్పము - మోక్షోపాయ విధిర్నామా ఽష్టాశీతి తమః పటలః

అంతేగాక శ్రీవైఖానస కల్పసూత్రములో కూడ ఈ విషయములు చెప్పబడినట్లుగా ఈ పుస్తకము మొదటి పేజీలలో చూపబడినది. ఈ

విషయములను వివరిస్తూ శ్రీనివాసమఖి లక్ష్మీవిశిష్టాద్వైత భాష్యమును, ఉత్తమ బ్రహ్మ విద్య అను గ్రంథములను రచించిరి.

సులభముగా తెలియుటకు ఆ తర్వాత ఉత్తమ బ్రహ్మ విద్యాసారము, మోక్షోపాయ ప్రదీపిక అనబడు చిన్న గ్రంథములు వచ్చినవి. వివరములకు ఆ గ్రంథములను చూడవలయును.

సారాంశమేమంటే పరిపూర్ణ శరణాగతితో భగవదారాధన చేయటమే దైవత్వ సిద్ధికి ఏకైక మార్గమనియూ, ఇటువంటి సాధన ఫలమే ముక్తియనియూ తెలుపబడినది.

అర్చకులు

వైఖానస భగవచ్ఛాస్త్రములలో అర్చక లక్షణములు, అర్చకుని విధులు నిర్దేశించబడినవి. ఆలయంయొక్క మహిమకు, ప్రాశస్త్యమునకు అర్చకుడు కూడ కారకుడే.

"అర్చకస్య తపోయోగాత్ అర్చనస్యాతి శాయనాత్
ఆభి రూప్యాచ్చ మూర్తీనాం దేవః సాన్నిధ్య మృచ్ఛతి"

అర్చకునియొక్క తపోయోగం వల్ల, అర్చనలోని విశిష్టత వల్ల, ప్రతిమయొక్క ఆభిరూప్యం వల్ల - ఆలయంలో దేవుడు సన్నిహితుడవుతాడు అని శాస్త్రములు చెప్పుచున్నవి.

అర్చకుడు తన శీలంవల్ల, నడవడి వల్ల, అర్చన విధులను నిర్వహించటంలో చూపే అభినివేశంవల్ల ప్రతిమలో దైవత్వాన్ని సాధిస్తాడు. ఒక శిలా ప్రతిమను దేవుడుగా రూపొందించటం అర్చకునకే సాధ్యమవుతుంది. అందుచే అర్చకుడు తన శాఖకు చెందిన శాస్త్ర విషయాలలో సరి అయిన అవగాహన కలిగివుండాలి. ఆచరణలో శాస్త్ర విధిగా వుండాలి. తాత్త్విక చింతన, విశాల భావములు, భూతదయ, శాంతి, కరుణ, సౌమ్యత కలిగివుండాలి. సలక్షణమైన అర్చకులకు గల గౌరవమును నేటికీ మనము చూచుచున్నాము. ఈ విషయమై ప్రకీర్ణాధికాము 11 వ అధ్యాయములో ఇట్లు చెప్పబడినది.

"వైఖానస సూత్రేణ నిషేకాది క్రియాన్వితాన్ విప్రాన్
వేదవిదః శ్రేష్ఠాన్ ధార్మికాన్ జ్ఞానతత్పరాన్ ॥
సౌమ్యాన్ జితేంద్రియాన్ శుద్ధాన్ విష్ణారాధనే పరాన్ ।
ఊహాపోహ విధానేన ధ్వస్తసంశయమానసాన్ ॥

అనగా వైఖానస సూత్రం ప్రకారం నిషేకాది సంస్కారాలు పొందినవారు, విప్రులు, వేద విదులు, శ్రేష్ఠులు, ధార్మికులు, జ్ఞాన తత్పరులు, సౌమ్యులు, జితేంద్రియులు, శుద్ధులు, విష్ణ్వారాధన తత్పరులు, ఊహాపోహ విధానంతో సంశయరహిత మానసులుగా అర్చకులుండవలయును.

అర్చక వృత్తిలో యున్నవారు కట్టు, బొట్టు, జుట్టులను వాటిని శాస్త్రానుసారము పాటించినచో వారికి గల గౌరవము చెప్పలేము.

ఒక మాట

యింతవరకు వైఖానసమును గురించి, ఆలయములను గురించి, అర్చకులను గురించి, వైఖానస కల్పసూత్రమును గురించి, వైఖానస గ్రంథములను గురించి చూచాయగా చెప్పబడినది. దీని తర్వాత వరుసగా నాలుగు వాచకములు రాగలవు. వాటిలో క్రమముగా వివరములు రాగలవు. ఈ శాస్త్రము అపారమైనది. దానిని కుదించి లౌకికులకు, పామరులకు అవగాహన కొరకు వ్రాయబడిన ఈ పుస్తకమును సహృదయతతో పాఠకులు స్వీకరించగలరని భావిస్తున్నాను. ఏవైనా దోషములున్నచో తెలియపరచినచో వాటిని స్వీకరించి పునర్ముద్రణలో సవరించగలమని మనవి చేయుచున్నాను.

వేదాంత వంశాంబుధి పూర్ణచంద్రమ్
వేదాంత శాస్త్రోదధి కుంభయోనిమ్ ।
వేదాంత విఖ్యివరదార్య శిష్యమ్
శ్రీ మజ్జగన్నాథ గురుం ప్రపద్యే ॥
శ్రీమద్గౌతమ గోత్రాయ గీతామృతప్రదాయినే
లక్ష్మీ నృసింహ గురవే భగవంస్తే నమోనమః ॥

Bibliography :

1. శ్రీ వైఖానస కల్పసూత్రము
2. మరీచి విమానార్చనకల్పము
3. ప్రకీర్ణాధికారము
4. శ్రీ వైఖానసాగమము by Sri S. K. రామచంద్రరావు
5. శ్రీ వైఖానస వైభవము by కీ॥శే॥ పార్థసారధి భట్టాచార్య
6. యజ్ఞాధికారము
7. క్రియాధికారము
8. ఖిలాధికారము
9. కాశ్యప జ్ఞానకాండము.

'వైఖానసము' మొదటి పుస్తకము సమాప్తము.

మనవి

ప్రతి వైఖానసుడు వైఖానసమును తెలుసుకోవలయును. శ్రీ వైఖానస దివ్య సిద్ధాన్త వివర్ధినీ సభ వారు ఈ ప్రచారమునకు చేయు కృషికి అందరూ సహకరించి అందరూ ఈ పుస్తకమును సేకరించుకొన ప్రార్థన.

వారి సలహాలు, సూచనలు పంపవలయును.

తిరుమల
19-1-1998

కార్యదర్శి
S.V.D.S.V. సభ.

శ్రీ విఖనసాచార్య స్తుతి పంచకమ్

శ్లో॥ నారాయణః పితాయస్య యస్యమాతా హరిప్రియా
భృగ్వాదిమునయశ్శిష్యాః తస్మై శ్రీ విఖనసే నమః ॥

శ్లో॥ నిమిశే నైమిశక్షేత్రే గోమత్యా సమలంకృతే
హరే రారాధనాసక్తం వందే విఖనసం మునిమ్ ॥

శ్లో॥ తులసీనళినాక్షైశ్చ కృతమాలా విభూషితం
అంచితం చోర్ధ్వపుండ్రైశ్చ వందే విఖనసం మునిమ్ ॥

శ్లో॥ కుండలాంగదహారాద్యైః ముద్రికాభిరలంకృతం
కాంచీ పీతాంబరధరం వందే విఖనసం మునిమ్ ॥

శ్లో॥ శరచ్చంద్ర ప్రతీకాశై ర్ధవళైరుపవీతకైః
సోత్తరీయం బద్ధశిఖం వందే విఖనసం మునిమ్.

శ్రీ విఖనసాచార్య మంగళ శ్లోకాని

శ్లో॥ లక్ష్మీవల్లభ సంకల్ప వల్లభాయ మహాత్మనే
శ్రీమద్విఖనసేతుభ్యం మునివర్యాయ మంగళమ్ ॥ 1

శ్లో॥ లక్ష్మ్యామాతృమతే తస్యాః పత్యా పితృమతేనఘైః
భృగాద్యైః పుత్రితేస్మాకం సూత్రకారాయ మంగళమ్ ॥ 2

శ్లో॥ స్వసూత్ర విహితోత్కృష్ట విష్ణు బల్యాఖ్య కర్మణా
గర్భవైష్ణవతాసిద్ధిఖ్యాపకాయా ఽస్తు మంగళమ్ ॥ 3

శ్లో॥ భక్త్యాభగవతః పూజాం ముక్త్యుపాయం శ్రుతీరితం
స్వయందర్శయతేస్మాకం సూత్రకారాయ మంగళమ్ ॥ 4

(మిగతా కవర్ 3వ పేజీలో)

శ్లో॥ శ్రీ వేంకటేశ కరుణాప్రవేశాగ్రభువేసదా
కరుణానిధయేస్మాకం గురవేతేస్తు మంగళమ్ ॥ 5

శ్లో॥ విష్ణోఃపరత్వకథనపూర్వమర్చా విధాయినే
శ్రీమద్విఖనసే నిత్యం గురవేతేస్తు మంగళమ్ ॥ 6

శ్లో॥ నారాయణపరం సూత్రం శ్రుతివాక్యైక సంశ్రయం
ప్రకాశం సూత్రకారాణాం ధృషతేమూర్ధ్ని మంగళమ్ ॥ 7

శ్లో॥ ఆత్మనో మునిరాజత్వ సూచనాయచ మూర్ధని
కిరీటధారిణే పాపహారిణేతేస్తు మంగళమ్ ॥ 8

శ్లో॥ జన్మన్యేవ స్వభుజయోర్ధ్వయో శంఖాధారిణే
వరదాభయహస్తాయ మునిరాజాయ మంగళమ్ ॥ 9

శ్లో॥ యోగనిష్ఠ ప్రభాయుక్త స్వరూపప్రతిభాననె
గురవే విఖనోనామ్నే విష్ణుపుత్రాయ మంగళమ్ ॥ 10

శ్లో॥ య ఇదంపద్యదశకం విఖనో మంగళాభిదం
పఠేద్వా శ్రుణుయాత్తస్య మంగళం తనుయాత్ప్రభుః ॥ 11

ఇతి శ్రీ ఆచార్య మంగళ శ్లోకాని సంపూర్ణమ్

గురు వందనమ్

శ్లో॥ నారాయణం సకమలం సకలామరేంద్రం
వైఖానసం మమగురుం నిగమాగమేంద్రం
భృగ్వత్రికశ్యప మరీచి ముఖాన్ మునీంద్రాన్
సర్వానహం కులగురూన్ ప్రణమామిమూర్ధ్నా ॥

శ్రీ వైఖానస దివ్య సిద్ధాన్త వివర్ధినీ సభ (రిజిష్టర్డ్)

శ్రీ విఖనస ఆశ్రమము

రింగ్ రోడ్ : తిరుమల

★ వివర్ధినీ సభ వారిచే తిరుమలలో నిర్వహింపబడుచున్న శ్రీ విఖనస ఆశ్రమమున చక్కని వసతులు గల 32 గదులు - 'శుభశ్రీ' కల్యాణ మంటపము - దిగువ పాకశాల - భోజనశాల కలవు.

★ ఆశ్రమ ప్రాంగణమున శ్రీ విఖనోమునీంద్రులమూర్తి ప్రతిష్ఠితమై త్రికాలార్చన నిర్వహింపబడుచున్నది. యాత్రార్థులై తిరుమలకేతెంచు స్వశాఖీయులీ ఆశ్రమములో స్వల్ప ని ర్వహణ వ్యయము చెల్లించి వసతిని పొందవచ్చును.

శ్రీ వైఖానస పత్రిక

(శ్రీ వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధినీ సభ వారిచే ప్రచురింపబడుచున్నది)

చందా వివరములు

మహారాజ పోషకులు	రూ. 5000-00
రాజ పోషకులు	రూ. 2500-00
పోషకులు	రూ. 1116-00
సంవత్సర చందా	రూ. 70-00
విడి ప్రతి	రూ. 6-00

ఉత్తర ప్రత్యుత్తరములు, వ్యాసములు, చందాలు వగైరా పంపవలసిన చిరునామాలు :

శ్రీ వైఖానస పత్రిక
S.V.D.S.V. సభ కార్యాలయం
రింగ్ రోడ్, తిరుమల
చిత్తూరు జిల్లా - 517 504
ఫోన్ : 77282

శ్రీ వైఖానస పత్రిక
వైద్య సేవాసదన్
రాజ్, యువరాజ్ ఎదురుగా
గాంధీనగర్, విజయవాడ-520 003
ఫోన్ : 574243